
సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

గురువారం, 12, జూన్, 2025



సోమశిలలో 39.448 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో బుధవారానికి 39.44 8 టీఎంసీలు ఉన్నాయి. పెన్నార్ డెల్టాకు 3,880, ఉత్తరకాలువకు 300, దక్షిణకాలువకు 350 క్యూసెక్కుల వంతున విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు)	రూ.99,540
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.9,020
మూడు శాతం జీఎస్టీతో	రూ.9,291
నవర (8 గ్రాములు)	రూ.74,328

గరిష్టం/కనిష్టం
35.4 /30.5

వాతావరణం

జిల్లాలో గురువారం ఆకాశం మేఘావృతంగా ఉండి, అక్కడక్కడ ఉరుములు, మెరుపుల వాతావరణం ఉంటుంది. బుధవారం గాలిలో తేమ 54 శాతంగా నమోదైంది.

న్యూస్‌రీల్

కాకాణి బెయిల్ పిటిషన్‌పై విచారణ నేటికి వాయిదా



నెల్లూరు (లీగల్): నెల్లూరు ఐదో అదనపు జిల్లా (ప్రత్యేక ఎస్సీ, ఎస్టీ)కోర్టులో మాజీమంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి దాఖలు చేసిన బెయిల్ పిటిషన్ బుధవారం విచారణకు వచ్చింది. అయితే పోలీసుల తరఫున స్పెషల్ పీపీ విజయమ్మ తమ వాదనలు వినిపించడనికి వాయిదా కోరారు. ప్రాసిక్యూషన్ అభ్యర్థన మేరకు ఇన్‌చార్జి కోర్టు న్యాయమూర్తి సోమశేఖర్ కేసు విచారణ గురువారానికి వాయిదా వేశారు

ఐఅండ్‌పీఆర్ డీడీ బదిలీ

నెల్లూరు (అర్బన్): జిల్లా సమాచార, పౌర సంబంధాల శాఖ డిప్యూటీ డైరెక్టర్ సదారావును ప్రభుత్వం విశాఖపట్నంకు బదిలీ చేస్తూ బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఆయన ఏప్రిల్ 2023లో విజయవాడ నుంచి నెల్లూరుకు బదిలీపై వచ్చి బాధ్యతలు చేపట్టారు. 2 ఏళ్ల 2 నెలల కాలం ఇక్కడ వివాదారహితుడిగా పనిచేశారు. సదారావు అధికారులు, జర్నలిస్టులతో స్నేహపూర్వక సంబంధాలతో కలిసిపోయారు. ఆయన స్థానంలో ఇంకా ఎవరినీ నియమించలేదు.

పంచాయతీ పూర్వ కార్యదర్శి సస్పెన్షన్

- డక్కిలి ఈఓపీఆర్డీ ప్రస్తుతం విధులు

పొదలకూరు : పొదలకూరు మేజర్ పంచాయతీ కార్యదర్శిగా పనిచేసిన ఎస్‌కే అల్లాభక్షును పంచాయతీరాజ్‌శాఖ కమిషనర్ సస్పెండ్ చేశారు. అల్లాభక్షు 2023 వరకు ఇక్కడ పనిచేసి ఉద్యోన్నతిపై తిరుపతి జిల్లా డక్కిలి ఈఓపీఆర్డీగా బదిలీపై వెళ్లారు. ఇక్కడ పనిచేసిన సమయంలో అక్రమ లే-అవుట్లకు అనుమతులతోపాటు భవనాల నిర్మాణానికి అక్రమంగా పంచాయతీ అనుమతులిచ్చారని ఆరోపణలపై విచారణ నిర్వహించి సస్పెండ్ చేశారు.

నేడు జెడ్పీ స్థాయీ సంఘ సమావేశాలు

నెల్లూరు (పొగతోట): జిల్లా పరిషత్ స్థాయీ సంఘ సమావేశాలు గురువారం నిర్వహించనున్నట్లు జెడ్పీ సీఈఓ మోహన్‌రావు తెలిపారు. జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ అధ్యక్షతన ఏడు స్థాయీ సంఘ సమావేశాలు జెడ్పీ కార్యాలయంలో ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం వరకు సమావేశాలు జరుగుతాయన్నారు. ఆయా శాఖల జిల్లా అధికారులు, జెడ్పీ సభ్యులు తప్పకుండా హాజరు కావాలని కోరారు.

విద్యుత్ క్రీడాకారుల ఎంపిక రేపు

నెల్లూరు (వీఆర్సీ సెంటర్): ఏపీ ట్రాన్స్‌కో ఇంటర్ సర్కిల్ బాల్‌బ్యాడ్మింటన్, బ్రిడ్జ్ పోటీలు విశాఖపట్నంలోని గాజువాకలో ఈ నెల 23 నుంచి 25వ తేదీ వరకు జరుగుతాయని ఏపీ ఎస్పీడీసీఎల్ జిల్లా సర్కిల్ స్పోర్ట్స్, గేమ్స్ సెక్రటరీ రామస్వామివేలు బుధవారం ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొనేందుకు ఏపీఎస్పీడీసీఎల్‌లో పని చేస్తున్న రెగ్యులర్ ఉగ్యోగులు, జూనియర్ లైన్‌మెన్ గ్రేడ్-2 ఉద్యోగులు అర్హులని తెలిపారు. ఈ నెల 13వ తేదీ సాయంత్రం 4 గంటలకు నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో నిర్వహించే సెలక్షన్స్‌లో పాల్గొనాలని, ఇతర వివరాలకు 90308 02038, 98660 70775 నంబర్లలో సంప్రదించాలని కోరారు.


11 బస్తాల రేషన్ బియ్యం పట్టివేత



జలదంకి: కూటమి ప్రభుత్వం డీలర్ల వ్యవస్థను ప్రకటించిన పదిరోజులకే అక్రమంగా రేషన్ బియ్యం దందా బయటపడింది. చామదలకు చెందిన డీలర్లు వెంకటసుబ్బారెడ్డి, వెంకట్రామిరెడ్డి దుకాణాల నుంచి మంగళవారం అర్ధరాత్రి రేషన్ బస్తాలను ఆటోలో తరలిస్తుండగా జలదంకి పోలీసులు ఆటోను పట్టుకుని స్టేషన్‌కు తరలించారు. ఆటోలో 11 బస్తాల బియ్యం ఉన్నట్లు గుర్తించారు. అదే సమయంలో అక్రమంగా తరలిస్తున్న మరో లారీని అక్రమ దందా నిర్వాహకులు వేరే రూట్లోకి మళ్లించినట్లు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఆ లారీలో భారీగా అక్రమ రేషన్ బియ్యం తరలివెళ్లినట్లు సమాచారం. ఎస్సై లతీఫున్నీసా మాట్లాడుతూ రేషన్ బియ్యం అక్రమంగా తరలిస్తున్నారన్న సమాచారంతో దాడులు నిర్వహించి ఆటోను పట్టుకుని కేసు నమోదు చేశామన్నారు. ఆటో డ్రైవర్ సత్తిబాబుతో పాటు ఇద్దరు డీలర్లపై కేసు నమోదు చేసి రెవెన్యూ అధికారులకు సమాచారం అందించామన్నారు. రెవెన్యూ అధికారులు బుధవారం చామదలలోని రేషన్ దుకాణాల వద్ద తనిఖీలు చేపట్టి 6ఏ కేసు నమోదు చేశారు. అనంతరం అక్రమ రేషన్ బియ్యాన్ని మద్దూరుపాడులోని స్టాక్ పాయింట్‌కు తరలించారు.

బడులిలా.. చదువులెలా

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రెండో విద్యా సంవత్సరం ప్రారంభవుతున్నా.. పాఠశాలల అభివృద్ధిని ఏడాదిగా విస్మరించింది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో నాడు-నేడు పథకం కింద ప్రారంభించిన అదనపు తరగతి గదుల నిర్మాణాలను నిధులు ఉన్నా నిర్లక్ష్యంగా వదిలేసింది. పాఠశాలల ప్రారంభం రోజే విద్యార్థులకు 'జగనన్న విద్యాకానుక' కింద యూనిఫాం, బూట్లు, టై, సాక్స్, బ్యాగ్, పాఠ్య పుస్తకాలు, నోటు పుస్తకాలు తదితర తొమ్మిది రకాల మెటీరియల్‌తో కిట్లను అందించింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తొలి ఏడాదిలో కిట్ల పంపిణీ నెలల తరబడి సాగింది. తాజాగా కూడా అదే పరిస్థితి నెలకొంది. ఇక పాఠశాలల్లో గత ప్రభుత్వంలో ఏర్పాటు చేసిన మౌలిక వసతులను నిర్వహణను విస్మరించింది.





నగరంలోని మున్సిపల్ హైస్కూల్లో ఏడాదిగా నిర్మాణానికి నోచుకోని అసంపూర్తిగా ఉన్న తరగతి గదులు

నేటి నుంచి పాఠశాలల పునః ప్రారంభం

జిల్లాకు వచ్చిన స్టూడెంట్స్ కిట్లు

వస్తువు	రావాల్సింది	వచ్చినవి	పెండింగ్
బ్యాగులు	1,61,959	1,52,940	9,019
బెల్టులు	1,15,548	1,15,548	-
నోటు పుస్తకాలు	8,74,740	8,74,740	-
బూట్లు	1,64,721	-	1,64,721
సాక్స్	3,29,442	-	3,29,442
యూనిఫాం	1,61,959	-	1,61,959
ఆక్స్‌ఫర్డ్ డిక్షనరీ	13,375	13,375	-
పాఠ్యపుస్తకాలు	7,71,185	7,69,519	1,666

- పూర్తి కాని ఉపాధ్యాయ బదిలీలు
- అసంపూర్తిగా తరగతి గదులు, టాయిలెట్స్ నిర్మాణాలు
- పూర్తిస్థాయిలో రాని స్టూడెంట్స్ కిట్స్
- యూనిఫాం, బూట్లు, సాక్స్‌లు పెండింగ్
- 9 వేలకు పైగా బ్యాగుల కొరత
- చాలా పాఠశాలల్లో పనిచేయని ఆర్వో ప్లాంట్లు
- ఉపాధ్యాయుల దృష్టంతా బదిలీల పైనే
- పూర్తిస్థాయిలో సిద్ధమవుతున్న కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలలు

నెల్లూరు (టౌన్): వేసవి సెలవుల అనంతరం గురువారం నుంచి పాఠశాలలను పునః ప్రారంభం కానున్నాయి. జిల్లాలో ఆయా పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు బడిబాట పట్టనున్నారు. ఓ వైపు ప్రభుత్వ పాఠశాలల్లో పెండింగ్ పనులు, అసంపూర్తి భవనాలు, పని చేయని మినరల్ వాటర్ ప్లాంట్లు విద్యార్థులకు స్వాగతం పలుకుతున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నేటితో ఏడాది పూర్తవుతోంది. పాఠశాలలకు దాదాపు 50 రోజులు వేసవి సెలవులిచ్చినా.. ఆయా పాఠశాలల్లో పెండింగ్‌లను పూర్తి చేయకపోవడంపై విద్యార్థుల తల్లిదండ్రులు మండి పడుతున్నారు. మరో వైపు జిల్లాకు పూర్తి స్థాయిలో స్టూడెంట్స్ కిట్స్ రాలేదు. ఇంకో వైపు టీచర్ల బదిలీలు పూర్తి కాలేదు. ఈ ప్రక్రియ ఎప్పటికో పూర్తవుతుందో తెలియని పరిస్థితి. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాఠశాలల పునః ప్రారంభం రోజే విద్యార్థులందరికీ విద్యాకానుకను అందించేవారు. పాఠశాలల్లో పూర్తి స్థాయిలో మౌలిక వసతులు కల్పించి సిద్ధం చేసిన పరిస్థితి ఉండేది.



మూలాపేటలోని బాలికల పాఠశాలలో హ్యాండ్ వాష్ కుళాయిల దుస్థితి

అసంపూర్తిగా నాడు-నేడు పనులు

రెండో విడత నాడు-నేడులో భాగంగా జిల్లాలో 1,356 ప్రభుత్వ పాఠశాలలను ఎంపిక చేశారు. వీటితోపాటు అంగన్‌వాడీలు, డైట్, బీఈడీ కళాశాలను కూడా ఎంపిక చేశారు. వీటిల్లో మౌలిక వసతుల కల్పనకు రూ.466.94 కోట్లు నిధులు మంజూరు చేశారు. రూ.190.45 కోట్లు నిదులు విడుదల చేశారు. ఈ నిధులతో కొన్ని పాఠశాలల్లో నిర్మాణాలను పూర్తి చేయగా కొన్నింట్లో నిర్మాణాలు మధ్యలో నిలిచిపోయాయి. ఆ తర్వాత సాధారణ ఎన్నికలు రావడంతో కూటమి ప్రభుత్వం ఏర్పాటైంది. ఈ పనులకు నిధులు ఉన్నప్పటికీ ఇంకా 554 టాయిలెట్స్‌కు తలుపులు బిగించలేదు. 250 కిచెన్ షెడ్లు, 485 తరగతి గదులు, 319 టాయిలెట్స్, 220 ఇంగ్లిష్ ల్యాబ్‌లు, పనిచేయని మెజార్టీ ఆర్వో ప్లాంట్లు తదితర వాటిల్లో అసంపూర్తిగా పనులు మిగిలిపోయాయి. కనీసం మరమ్మతులకు గురైన వాటిని కూడా బాగు చేయని పరిస్థితి ఉంది. పాఠశాలలను పునః ప్రారంభిస్తే విద్యార్థులకు చెట్లు కింద తరగతి గదులు నిర్వహించాల్సి ఉంటుంది.



మూలాపేట స్కూల్లో మరుగుదొడ్ల దుస్థితి

అరకొరగా స్టూడెంట్స్ కిట్స్

పాఠశాలల పునః ప్రారంభం తర్వాత విద్యార్థులకు అందించాల్సిన స్టూడెంట్స్ కిట్స్ జిల్లాకు అరకొరగానే వచ్చాయి. గత ప్రభుత్వ హయాంలో తొలిరోజే విద్యార్థులకు విద్యాకానుక అందజేసిన పరిస్థితి ఉంది. నేటికి యూనిఫాం, బూట్లు, సాక్స్‌లు ఒకటి కూడా జిల్లాకు రాని పరిస్థితి ఉంది. కొన్ని అరకొరగానే వచ్చాయి. పాఠశాలల పునః ప్రారంభం రోజును విద్యార్థులకు పూర్తి స్థాయిలో స్టూడెంట్స్ కిట్స్‌ను అందజేసే పరిస్థితి లేదు.

పూర్తికాని బదిలీలు

జిల్లాలో ఉపాధ్యాయ బదిలీలు పూర్తిస్థాయిలో కాలేదు. హెడ్‌మాస్టర్లు, స్కూల్ అసిస్టెంట్లు బదిలీలు పూర్తి చేసినా సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయ బదిలీలు మంగళవారం ప్రారంభించారు. జిల్లాలో ఎక్కువగా ప్రాథమిక పాఠశాలలే ఉన్నాయి. ఈ పాఠశాలల్లో 2,543 మంది ఎస్జీటీలు ఉన్నారు. వీరిలో 1,516 మంది ఉపాధ్యాయులు బదిలీకి దరఖాస్తు చేసుకున్నారు. ప్రస్తుతం మాన్యువల్ కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న నేపథ్యంలో రోజుకు 300 మందికి మించి బదిలీ చేసే పరిస్థితి లేదు. అభ్యంతరాలు వ్యక్తం చేసి పెండింగ్ పెడితే బదిలీల ప్రక్రియ పది రోజులు పట్టే అవకాశం ఉంది. సాధారణంగా పాఠశాలల పునః ప్రారంభం నాటికి బదిలీల ప్రక్రియ పూర్తి చేయాల్సి ఉన్నా.. ప్రభుత్వం తీసుకున్న అసంబద్ధ నిర్ణయాలతో జాప్యం జరుగుతోంది.

తొలుత మోడల్ ప్రైమరీ స్కూల్స్‌కు ప్రాధాన్యత



తొలుత మోడల్ ప్రైమరీ స్కూల్స్‌కు ప్రాధాన్యత ఇవ్వనున్నాం. ఒక్కో స్కూల్‌లో 5 గదులు, ఐదు గురు టీచర్లు ఉండే విధంగా చర్యలు తీసుకుంటున్నాం. ఒక వేళ ఆ పాఠశాలలో 5 గదులు లేకుంటే వరండాను పార్టీషన్ చేసి తరగదిగా నిర్వహిస్తాం. లేకుంటే 500 మీటర్ల లోపు ఉన్న పాఠశాల ఉంటే అక్కడ కొన్ని తరగతులను నిర్వహిస్తాం. వీటితో హైస్కూల్స్‌గా అప్‌గ్రేడ్ అయిన యూపీ పాఠశాలలను తీసుకోనున్నాం. అసంపూర్తిగా నిలిచిన నాడు-నేడు పనులు, టాయిలెట్స్, అదనపు తరగతి గదులు, ఇతర సౌకర్యాలను గూగుల్ ఫాంలో అప్‌డేట్ చేయాలని ఆదేశాలు జారీ చేశారు.

– వెంకటసుబ్బయ్య, ఏపీసీ, సమగ్రశిక్ష

షెడ్యూల్ ప్రకారం అయితే బదిలీలు పూర్తయ్యేవి



తొలుత ప్రభుత్వం విడుదల చేసిన షెడ్యూల్ ప్రకారం అయితే పాఠశాలల పునః ప్రారంభం నాటికి బదిలీల ప్రక్రియను పూర్తి చేసేవారు. ఉపాధ్యాయులు పట్టుబట్టి మాన్యువల్ కౌన్సెలింగ్ కావాలనడంతో ఎస్జీటీల బదిలీలు ఆలస్యమయ్యాయి. వీటిని వీలైనంత త్వరగా పూర్తి చేస్తాం. పాఠశాలల్లో మౌలిక సదుపాయాలను పూర్తి స్థాయిలో కల్పిస్తాం.

– బాలాజీరావు, డీఈఓ

పసుపు ధరలు పతనం



పొలాల్లో ఆరబోసిన పసుపు

- గతేడాది క్వింటా రూ.15 వేల నుంచి రూ.16 వేలు
- ప్రస్తుతం రూ.8 వేల నుంచి రూ.9 వేలే
- ఎకరాకు రూ.2 లక్షల పెట్టుబడి
- దిగుబడులకు వాతావరణ ప్రతికూలతలు
- 45 క్వింటాళ్ల నుంచి 30 క్వింటాళ్లకు తగ్గిన దిగుబడి
- గిట్టుబాటు ధర కల్పించడంలో కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం

కూటమి ప్రభుత్వ విఫల పాలనలో తాజాగా పసుపు రైతులు బాధితులయ్యారు. కేంద్రం ప్రత్యేకించి పసుపు కొనుగోలు బోర్డు ఏర్పాటు చేసినా.. రాష్ట్ర ప్రభుత్వం కనీసం ప్రత్యేక కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయడంలో చూపిస్తున్న నిర్లక్ష్యం రైతుల పాలిట శాపంగా పరిణమించింది. మిర్చి, ధాన్యం, పత్తి, పొగాకు ధరలు గతేడాదితో పోల్చితే సగానికి సగం పతనం కావడంతో ఇప్పటికే రైతులు విలవిల్లాడుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో ఏ పంటకైనా మార్కెట్లో ధరలు పతనమైతే వెంటనే మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేయించడంతో తిరిగి ధరలు పుంజుకుని గిట్టుబాటు ధరలు లభించిన పరిస్థితి ఉండేది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి అన్ని పంటలు సాగు చేసే రైతులను గాలికి వదిలేసింది.

ఉదయగిరి రూరల్: ఆరుగాలం కష్టపడి, అప్పులు తెచ్చి రూ.లక్షల్లో పెట్టుబడులు పెట్టి పండించిన పసుపు రైతుల కంట కన్నీరు కారుతోంది. పంటకు ఆశించిన మేర దిగుబడి రాక, మద్దతు ధర లేక ఎలా బతకాలి బాబూ అంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో ఎక్కడా లేని విధంగా ఉదయగిరి నియోజకవర్గంలోని ఉదయగిరి మండలం కొండకింద పల్లెల్లో సుమారు 50 ఏళ్ల నుంచి ఆయా గ్రామాల్లో అత్యధికంగా రైతులు పసుపు పంటను సాగు చేస్తున్నారు. వరికుంటపాడు, వింజమూరు, సీతారామపురం, ఇందుకూరుపేట, అనంతసాగరం తదితర మండలాల్లో కూడా కొంత మేర పసుపు పంట సాగు చేస్తున్నారు. జిల్లాలో ఈ ఏడాది సుమారు 500 ఎకరాలకుపైగా పసుపు పంట సాగు చేసినట్లు అధికారుల గణాంకాలు చెబుతున్నాయి. ఈ పంట తొమ్మిది నెలలకు చేతికొస్తుంది. గతంలో మార్కెట్లో పసుపు ధరలు ఆశాజనకంగా ఉండడంతో ఈ ఏడాది ఎక్కువ మంది పసుపు సాగు వైపు దృష్టి సారించారు. ఎకరా పసుపు పంట సాగుకు అన్ని ఖర్చులు కలుపుకుని సూమారు రూ.1.50 నుంచి రూ. 2 లక్షల వరకు ఖర్చు అవుతోంది

తగ్గిన దిగుబడులు.. దిగజారిన ధరలు

సాధారణంగా ఎకరాకు పసుపు పంట 40 నుంచి 45 క్వింటాళ్ల వరకు దిగుబడి రావాల్సి ఉంటుంది. అయితే ఈ ఏడాది వాతావరణంలో ప్రతికూల పరిస్థితులు కారణంగా తెగుళ్ల ప్రభావం అధికంగా ఉండడంతో దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపిందని రైతులు వాపోతున్నారు. భూసారాన్ని బట్టి కొంత మంది రైతులకు 40 క్వింటాళ్ల లోపు దిగుబడులు రాగా, అత్యధిక మంది రైతులకు సగటున ఎకరాకు 30 క్వింటాళ్లు కూడా దిగుబడి రాలేదని వాపోతున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా గతేడాది పసుపు ధరలు రికార్డు స్థాయిలో క్వింటా రూ.15 వేల నుంచి రూ. 16 వేలు పలికింది. ఈ ఏడాది క్వింటా రూ.8 వేల నుంచి రూ.9 వేలకు పడిపోయింది. అంటే దాదాపు సగానికి సగం ధరలు పతనం కావడంతో, దిగుబడులు గణనీయంగా తగ్గడంతో రైతులకు కనీసం పెట్టుబడి కాదు కాదా.. కూలీ పాటు ఖర్చులు కూడా వచ్చే పరిస్థితి లేని పసుపు రైతాంగం కన్నీటి పర్యంతం అవుతోంది.

ఏడాదికేడాదికి పెరుగుతున్న ఖర్చులు

పసుపు సాగుకు ఏడాదికేడాదికి ఖర్చులు పెరుగుతున్నాయి. ఎకరాకు దుక్కి దున్నడం దగ్గర నుంచి కోత వరకు రేట్లు విపరీతంగా పెరిగిపోయాయి. కూలీల ఖర్చులు పెరిగాయి. పసుపు పంట సాగుకు పలువురు రైతులు పెట్టుబడికి అప్పుగా తెచ్చి పెట్టి సాగు చేస్తున్నారు. పంట సాగు సమయంలో ధరలు ఓ మోస్తరుగా ఉన్నా.. పంట చేతి కొచ్చే సమయానికి పూర్తిగా తగ్గిపోతుండడంతో రైతులు పెట్టుబడి రాక ఇబ్బందులు పడుతున్నారు. ఏటా ఎరువులు, విత్తనపు పసుపు, పురుగు మందులు ధరలు ఆకాశానంటుతున్నాయి. ప్రస్తుతం ఎకరాకు సుమారు రూ.2 లక్షల వరకు ఖర్చు అవుతోందని రైతులు వాపోతున్నారు.

విస్మరించిన ప్రభుత్వం

దేశ వ్యాప్తంగా పసుపు రైతులకు గిట్టుబాటు ధర కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వాల సారథ్యంలో ప్రత్యేక బోర్డులు, కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తోంది. పక్క రాష్ట్రం తెలంగాణలో సైతం పసుపు బోర్డును ఏర్పాటు చేస్తే.. కేంద్ర ప్రభుత్వంలో భాగస్వామ్యంగా ఉన్న రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం కనీసం ఆ ఊసే ఎత్తడం లేదు. మార్కెట్లో వ్యాపారులు ధరలు తగ్గించి కొనుగోలు చేస్తున్నా.. పట్టించుకోవడం లేదని రైతులు వాపోతున్నారు. కనీసం స్థానికంగా కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని రైతులు కోరుతున్నా ఆ దిశగా చర్యలు తీసుకోకపోవడం దారుణమని రైతులు వాపోతున్నారు. ఇక్కడ పండించిన పంటను దుగ్గిరాల యార్డుకు తరలించి విక్రయించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుందన్నారు. అదే స్థానికంగా కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేస్తే.. రవాణా ఖర్చులైనా మిగులుతాయని రైతాంగం డిమాండ్ చేస్తోంది.

పసుపు పంటకు గిట్టుబాటు ధర కల్పించాలి



పసుపు రైతులు కష్టపడి పండించిన పంటకు ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించాలి. గిట్టుబాటు, మద్దతు ధర లేక రైతులు అల్లాడుతుంటే అధికారులు పట్టించుకోవడం లేదు. పండించిన పంటను సమీపంలో మార్కెట్ సౌకర్యం లేక ఇతర ప్రాంతాలకు వెళ్లి అమ్ముకోవాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ ప్రాంతంలో పసుపు పంట ఎక్కువ విస్తీర్ణంలో సాగవుతోంది. మార్కెట్ సౌకర్యం కూడా కల్పించాలి. ప్రస్తుతం పసుపు ధరలు తగ్గడంతో పెట్టుబడి వచ్చే పరిస్థితి కానరావడం లేదు. పంటను కల్లాల్లోనే అమ్ముకోవాల్సి వస్తోంది.

– కాకు వెంకటయ్య, రైతు సంఘం నాయకుడు, ఉదయగిరి


మీడియాపై దాడి హేయమైన చర్య



మాట్లాడుతున్న రాష్ట్ర అధికార ప్రతినిధి చీదెళ్ల కిషన్

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పత్రిక రంగంపై అనేక రకాలుగా దాడులు జరుగుతున్నాయని, మరి ముఖ్యంగా సాక్షి దినపత్రిక కార్యాలయాలపై దాడులు చేయడం హేయమైన చర్య అని వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి చీదెళ్ల కిషన్ తీవ్రంగా మండిపడ్డారు. బుధవారం 44వ డివిజన్ వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో యువతకు ఇచ్చిన హామీలను అమలు చేయకపోగా, ఇదేమిటని ప్రశ్నించిన వారిపై అక్రమ కేసులు బనాయించడం ఎంత వరకు సమంజసం అని ప్రశ్నించారు. తమ పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా కొనసాగిన ఐదేళ్ల కాలంలో ఏనాడూ ఇలాంటి దారుణ ఘటనలు జరగలేదని, పత్రికా రంగాన్ని స్వేచ్ఛగా బతికేలా చేశారన్నారు. కానీ సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ ఇద్దరూ సాక్షి మీడియాపై తమ అక్కసు వెళ్లగక్కడం సరైన పద్ధతి కాదన్నారు. మీడియాకు స్వేచ్ఛ ఇచ్చినప్పుడే ప్రభుత్వానికి ప్రజలకు వారధిగా పని చేయగలుగుతారన్నారు. జిల్లాలో వైఎస్సార్‌సీపీ చాలా బలంగా ఉందని, యువత అందరూ జగన్‌మోహన్‌రెడ్డి అండగా నిలుస్తున్నారని అందుకు ప్రధాన కారణం కూటమి ప్రభుత్వం యువతను మోసం చేయడమే నన్నారు.

అవకాశాలతో యువత ఆర్థికంగా ఎదగాలి



సాంకేతిక శిక్షణలో సూచనలు ఇస్తున్న జిల్లా ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శ్రీనివాసులు

నెల్లూరు రూరల్: ఆహార శుద్ధి పరిశ్రమల్లో ఉన్నటువంటి అపార అవకాశాలను వినియోగించుకుని గ్రామీణ యువత ఆర్థికంగా ఎదగాలని జిల్లా ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ బి శ్రీనివాసులు కోరారు. బుధవారం కలెక్టరేట్లోని తిక్కన ప్రాంగణంలో డీఆర్‌డీఏ, మెప్మా క్షేత్రస్థాయి సిబ్బందికి ఆహార శుద్ధి కార్యకలాపాలపై సాంకేతిక శిక్షణ అందించారు. ఆయన మాట్లాడుతూ రెడీ టు ఈట్, రెడీ టు కుక్ విధానంలో ఆహార ఉత్పత్తులకు ఆదరణ పెరుగుతున్న దృష్ట్యా, ఆహార శుద్ధి రంగంలో ఉన్నటు వంటి అపార అవకాశాలను వినియోగించుకోవాలన్నారు. ప్రధానమంత్రి సూక్ష్మ ఆహార శుద్ధి పరిశ్రమల క్రమబద్ధీకరణ పథకం కింద సూక్ష్మ ఆహార ప్రాసెసింగ్ యూనిట్లను ఫార్మలైజ్ చేయడం, ప్రాసెసింగ్ సామర్థ్యాన్ని పెంచడం మౌలిక సదుపాయాలు, ప్యాకేజింగ్, మార్కెటింగ్, బ్రాండింగ్, నైపుణ్యాభివృద్ధి అందించడం, స్థిరమైన ఉపాధి అవకాశాలను సృష్టించవచ్చన్నారు. ఈ పథకంలో 30 శాతం సబ్సిడీ అందిస్తున్నారని వివరించారు. వృద్ధి కోసం ఆర్థిక సహాయం అందించడం, గ్రూపులుగా ఏర్పడిన ఉత్పత్తిదారులకు, స్వయం సహాయ సంఘాలకు మౌలిక వసతులు కల్పించడం, వాటికి బ్రాండింగ్, మార్కెటింగ్ మద్దతు కల్పించడమే కాకుండా వ్యాపార నైపుణ్యాలు, ఫుడ్ హ్యాండ్లింగ్ శిక్షణ ఇచ్చి కొత్త ఆవిష్కరణలు, స్టార్టప్‌లకు మద్దతు అందిస్తారన్నారు.

మరో ఇద్దరు విద్యార్థినులకు కరోనా

- జిల్లాలో 11కి చేరిన కేసులు

నెల్లూరు (అర్బన్): జిల్లాలో బుధవారం మరో ఇద్దరికి కరోనా నిర్ధారణ అయింది. జ్వరం, జలుబు, గొంతు నొప్పితో బాధపడుతున్న నగరానికి చెందిన 20, 22 ఏళ్ల ఇద్దరు విద్యార్థినులు ప్రభుత్వ పెద్దాస్పత్రిలో కోవిడ్ పరీక్షలు చేయించుకోవడంతో కరోనా స్వల్ప లక్షణాలు ఉండడంతో వారిని హోం ఐసోలేషన్‌లో ఉంచి వైద్యాధికారులు పర్యవేక్షిస్తున్నారు. ఇప్పటి వరకు జిల్లాలో 11 మంది బాధితులు తేలారు. కోవిడ్ క్రమక్రమంగా విస్తరిస్తుండడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం రక్షణ చర్యలతోపాటు కోవిడ్ పరీక్షలు విరివిగా చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

బడికి రెడీ..

వేసవి సెలవుల అనంతరం పాఠశాలలు గురువారం పునఃప్రారంభమవుతున్నాయి. ఈ నేపథ్యంలో పిల్లలకు కావాల్సిన సామగ్రి కొనుగోలు చేయడంలో తల్లిదండ్రులు నిమగ్నమయ్యారు. నెల్లూరులో షూలు, బ్యాగ్‌లు, విద్యా సామగ్రి తదితరాలు విక్రయించే దుకాణాలు బుధవారం కిటకిటలాడాయి. హాస్టళ్లలో ఉండే విద్యార్థులు కుటుంబ సభ్యులతో వచ్చి తమకు కావాల్సిన వస్తువులు కొనుగోలు చేశారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, నెల్లూరు



స్కూల్ బ్యాగ్‌లు కొనుగోలు చేస్తూ..



సండే మార్కెట్‌లో సందడి



ట్రంకు పెట్టె, కుర్చీ కొనుగోలు చేసి తీసుకెళ్తూ..



షూ సరిచూసుకుంటూ..



హాస్టల్‌కు సామగ్రి తీసుకెళ్తూ..

క్లుప్తంగా

బైక్‌పై స్వగ్రామానికి వెళ్తుండగా..

• రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



సతీష్ (ఫైల్)

తోటపల్లిగూడూరు: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతిచెందిన ఘటన మండలంలో చిన్నచెరుకూరు సమీపంలో జరిగింది. ఎస్సై వీరేంద్రబాబు కథనం మేరకు.. ఇందుకూరుపేట గ్రామానికి చెందిన వెంపులూరు సతీష్ (30) అనే వ్యక్తికి భార్య, ఇద్దరు ఆడపిల్లలున్నారు. అతను చిన్నపాటి కాంట్రాక్ట్ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈ క్రమంలో పనుల విషయమై మంగళవారం రాత్రి ముత్తుకూరు మండలం వల్లూరు గ్రామంలో కూలీలతో మాట్లాడాడు. బుధవారం వేకువజామున స్వగ్రామమైన ఇందుకూరుపేటకు మోటార్‌బైక్‌పై బయలుదేరాడు. కాకుపల్లి సెంటర్ – చిన్నచెరుకూరు మార్గమధ్యలో కల్వర్టును బైక్ ఢీకొట్టింది. దీంతో పక్కనే ఉన్న పంట కాలువలో సతీష్ పడిపోయాడు. ఈ ప్రమాదంలో తలకు తీవ్రగాయమై అక్కడికక్కడే మృతిచెందాడు. ఉదయం గుర్తించిన వాహనదారులు పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని కాలువలో నుంచి బయటకు తీయించి శవపరీక్ష నిమిత్తం నెల్లూరు జీజీహెచ్‌కు తరలించారు. కేసు దర్యాప్తు చేపట్టారు.

వివాహిత బలవన్మరణం

నెల్లూరు సిటీ: నెల్లూరు రూరల్ మండలంలోని కల్లూరుపల్లిలో ఓ వివాహిత ఆత్మహత్యకు పాల్పడిన ఘటనపై బుధవారం రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు. వారి కథనం మేరకు.. కల్లూరుపల్లిలో ఆర్‌డీటీ కాలనీకి చెందిన బాషా, మరియమ్మల కుమార్తె రజియ (23)కు ఆరేళ్ల క్రితం వివాహమైంది. కొంతకాలానికి భర్త నుంచి విడిపోయి తల్లి వద్ద ఉంటోంది. రజియకు కుమారుడు ఉన్నాడు. కాగా తల్లి తిట్టిందని రజియ మనస్తాపానికి గురై మంగళవారం ఇంట్లోని ఫ్యాన్‌కు ఉరేసుకుని బలవన్మరణానికి పాల్పడింది. దీంతో కుటుంబ సభ్యులు గమనించి హాస్పిటల్‌కు తరలించారు. అప్పటికే రజియ మృతిచెందింది. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలందించాలంటూ..

• సీపీఎం ఆధ్వర్యంలో ఆందోళన



ధర్నా చేస్తున్న సీపీఎం నేతలు, కార్యకర్తలు

నెల్లూరు(అర్బన్): నగరంలోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో (పెద్దాస్పత్రి) సూపర్ స్పెషాలిటీ వైద్యసేవలు సక్రమంగా అందించాలని కోరుతూ సీపీఎం రూరల్ నియోజకవర్గ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం ఆ పార్టీ కార్యకర్తలు ఆస్పత్రి ప్రాంగణంలో ర్యాలీ నిర్వహించి అనంతరం ధర్నా చేశారు. ఈ సందర్భంగా మాజీ డిప్యూటీ మేయర్, సీపీఎం సీనియర్ నాయకుడు మాదాల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రభుత్వ మెడికల్ కళాశాలకు అనుబంధంగా పెద్దాస్పత్రికి ప్రభుత్వం న్యూరో, గుండె, కేన్సర్, యూరాలజీ లాంటి పలు సూపర్ స్పెషాలిటీ విభాగాలను మంజూరు చేయడమే కాకుండా డాక్టర్లను నియమించిందన్నారు. అయితే ఆయా విభాగాల్లో డాక్టర్లు సక్రమంగా ఉండటం లేదని ఆరోపించారు. పూర్తిస్థాయిలో డాక్టర్లు అందుబాటులో ఉంటూ పూర్తిస్థాయిలో వైద్య సేవలందించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే శుద్ధి చేసిన నీటిని రోగులకు అందించాలని కోరారు. డయాలసిస్ రోగులకు ఆస్పత్రిలోనే మందులు ఉచితంగా అందించాలన్నారు. కొన్ని రకాల మందులను బయటకు డాక్టర్లు రాసివ్వడం సరికాదన్నారు. పరిశుభ్రతను మెరుగుపరచాలని కోరారు. వీటిపై తక్షణమే అధికారులు స్పందించి మెరుగైన వసతులు, సేవలు రోగులకు అందించాలని లేకుంటే ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆ పార్టీ నియోజకవర్గ కార్యదర్శి కొండా ప్రసాద్, నాయకులు అరిగెల రమమ్మ, షాహీనా బేగం, అజీజ్, సుధాకర్, షమీం, పెంచల నరసయ్య, ఒంగోలు సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

పొట్టకూటి కోసం వచ్చి..

• మినీలారీ, మిల్లర్ మధ్య నలిగిన ప్రాణం



సురేష్ మృతదేహం

సీతారామపురం: పొట్టకూటి కోసం వచ్చిన బండారు సురేష్ (27) అనే వ్యక్తి ప్రమాదంలో ప్రాణాలొదిలిన ఘటన సీతారామపురం బస్టాండ్ సెంటర్లో జరిగింది. స్థానికులు, పోలీసుల కథనం మేరకు.. బస్టాండ్ సెంటర్‌లో గల కేరళ ఇంగ్లిష్ మీడియం స్కూల్ స్లాబ్ పనుల నిమిత్తం బుధవారం ఉదయం ప్రకాశం జిల్లా చంద్రశేఖరపురం గ్రామ వడ్డెరాజు నగర్ ప్రాంతం నుంచి కూలీల బృందం మినీలారీలో కాంక్రీట్ మిల్లర్‌తో సహా చేరుకుంది. కూలీలు కిందకు దిగి కాంక్రీట్ మిల్లర్‌ను పాఠశాల ఆవరణలోకి ర్యాంప్ పైనుంచి లాక్కెళ్లేందుకు ప్రయత్నించారు. అయితే సాధ్యపడలేదు. సురేష్ కర్ర సాయంతో మినీలారీ చేత మిల్లర్‌ను నెట్టించే క్రమంలో కర్ర కాస్తా విరిగిపోయింది. దీంతో మిల్లర్‌ను పైకి లాగుతున్న కూలీలు ఒక్కసారిగా దాన్ని వదిలేయడంతో వేగంగా వెనక్కు వచ్చింది. ఈ క్రమంలో మిల్లర్, మినీలారీ మధ్య సురేష్ నలిగిపోయాడు. సహచర కూలీలు అతి కష్టంపై క్షతగాత్రుడిని బయటకు తీసి 108 అంబులెన్స్‌లో ఉదయగిరి ప్రభుత్వాస్పత్రికి తరలించే లోపు మార్గమధ్యలో కుర్రపల్లి వద్దకు వచ్చేసరికి మృతిచెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉదయగిరికి తరలించారు.

ఆత్మకూరులో కార్డన్ సెర్చ్



వేలిముద్రలు సేకరిస్తున్న డీఎస్పీ వేణుగోపాల్, ఎస్సై జిలానీ

ఆత్మకూరు రూరల్: ఆత్మకూరు పట్టణంలోని తిప్ప ప్రాంతంలో బుధవారం తెల్లవారుజాము నుంచి ఆత్మకూరు డీఎస్పీ వేణుగోపాల్ ఆధ్వర్యంలో పోలీసులు కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా 300 కుటుంబాల్లో తనిఖీలు చేసి సరైన పత్రాల్లేని 25 మోటార్‌బైక్‌లు స్వాధీనం చేసుకున్నారు. 15 మంది స్థానికేతరులను గుర్తించి వేలిముద్రలు సేకరించి కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ దొంగతనాల నివారణ, శాంతిభద్రతల పరిరక్షణ, అసాంఘిక శక్తుల ఏరివేత లక్ష్యంగా ఎస్పీ కృష్ణకాంత్ ఆదేశాల మేరకు సెర్చ్ నిర్వహించామన్నారు. పరారీలో ఉన్న నేరస్తులను గుర్తించి అదుపులోకి తీసుకోవడం, బంగారు, వెండి వంటి చోరీ సొత్తు, రికార్డుల్లేని వాహనాలు, అక్రమ మద్యం, ఆయుధాలు, పేలుడు పదార్థాలు, మాదకద్రవ్యాలను స్వాధీనం చేసుకోవడమే సెర్చ్ ముఖ్య ఉద్దేశమన్నారు. సీఐలు గంగాధర్, వేమారెడ్డి, సబ్ డివిజన్ పరిధిలోని 8 మంది ఎస్సైలు, 60 మంది పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పెంచలకోనలో శాస్త్రోక్తంగా జ్యేష్టాభిషేకం



విశేషాలంకరణలో స్వామి, అమ్మవార్లు

రాపూరు: జిల్లాలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోనలోని పెనుశిల లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో బుధవారం జ్యేష్టాభిషేక వేడుకలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. జ్యేష్ట మాసంలో జ్యేష్ట నక్షత్రం, పౌర్ణమి, ఒకేరోజు వచ్చిన సందర్భంగా వైష్ణవ దేవస్థానాల్లో హోమం, అభిషేకాలు, నిర్వహించడం ఆచారమని ప్రధానార్చకులు సీతారామయ్య స్వామి, పెంచలయ్యస్వామి వెల్లడించారు. 5 గంటలకు సుప్రభాతం, అభిషేకం, పూలంగిసేవ, నరసింహ హోమం నిర్వహించారు. 10 గంటలకు శ్రీవారి నిత్య కల్యాణ మండపంలో స్నపనపీఠంపై నరసింహస్వామి, ఆదిలక్ష్మి, చెంచులక్ష్మీదేవిల ఉత్సవ విగ్రహాలను కొలువుదీర్చారు. వాటి ముందు 81 కలశాలను ఏర్పాటుచేసి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆ కలశాల్లోని జలాలతో స్వామి, అమ్మవార్లకు వేదపండితులు స్నపన తిరుమంజనం జరిపారు. రాత్రి స్వామి, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను తిరుచ్చిపై కొలువుదీర్చి కోన మాడవీధుల్లో క్షేత్రోత్సవం నిర్వహించారు.

కండలేరులో 37.954 టీఎంసీలు

రాపూరు: కండలేరు జలాశయంలో బుధవారం నాటికి 37.954 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్టు ఇన్‌చార్జి ఈఈ రామచంద్రమూర్తి తెలిపారు. సత్యసాయి గంగ కాలువకు 2,300, పిన్నేరు కాలువకు 10, లోలెవల్ కాలువకు 60, హైలెవల్ కాలువకు 50, మొదటి బ్రాంచ్ కాలువకు 85 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నట్లు వెల్లడించారు.

ఫీల్డ్ అసిస్టెంట్ నియామకంపై అభ్యంతరం



ఎంపీడీఓతో మాట్లాడుతున్న సర్పంచ్ గోపీ తదితరులు

కొండాపురం: మండలంలోని మర్రిగుంటలో ఎన్‌ఆర్‌ఈజీఎస్ ఫీల్డ్ అసిస్టెంట్ నియామకంపై సర్పంచ్ దార్ల గోపీ, ఉపసర్పంచ్ జెజవాడ విష్ణు, మరికొందరు గ్రామస్తులు అభ్యంతరం వ్యక్తం చేశారు. బుధవారం ఎంపీడీఓ ఎస్.ఆదినారాయణను కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గోపీ మాట్లాడుతూ గ్రామంలో 220 జాబ్‌కార్డులున్నాయని తెలిపారు. చిన్న గ్రామమైన మర్రిగుంటలో ఫీల్డ్ అసిస్టెంట్‌గా అంకబాబు అనే వ్యక్తి 17 సంవత్సరాలుగా విధులు నిర్వహిస్తున్నాడని చెప్పారు. ఇప్పటి వరకు అవకతవకలు జరగలేదన్నారు. సోషల్ ఆడిట్‌లో కూడా రికవరీ లేదన్నారు. అయితే అధికార పార్టీ నాయకుల మాటలు విని గ్రామానికి చెందిన మరో వ్యక్తికి రెండో లాగిన్ ఇచ్చి పనులు చేయిస్తున్నారని వాపోయారు. అనధికారికంగా ఏర్పాటు చేసిన ఫీల్డ్ అసిస్టెంట్‌ను తొలగించాలని కోరారు. రెండో వ్యక్తికి లాగిన్ ఇవ్వడంపై ప్రభుత్వ జీఓ ఉంటే ఇవ్వాల్సిందిగా ఎంపీడీఓను అడిగారు. తనకు లాగిన్ ఇచ్చే అధికారం ఉందని, జీఓ కావాలంటే సమాచార హక్కు చట్టం ద్వారా తీసుకోవాలని ఆయన అన్నారు. మొదటి వ్యక్తి సరిగా విధులు నిర్వర్తించకపోవడంతోనే రెండో వ్యక్తికి లాగిన్ ఇచ్చి పనిచేయిస్తున్నట్లు సమాధానమిచ్చారు. దీనిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసుకోవచ్చని ఎంపీడీఓ అన్నారు.

యువకుడి అనుమానాస్పద మృతి



మృతదేహాన్ని పరిశీలిస్తున్న అల్లూరు ఎస్సై కిశోర్‌బాబు

అల్లూరు: అనుమానాస్పద స్థితిలో ఓ యువకుడు మృతిచెందిన ఘటన అల్లూరు పాత మటన్ మార్కెట్ ప్రాంతంలో మంగళవారం రాత్రి జరిగింది. పోలీసుల కథనం మేరకు వివరాలు.. అల్లూరు దళితవాడకు చెందిన గంటా సురేష్ (26) సెంట్రింగ్ పనులకు వెళ్తుంటాడు. అతను తన అవ్వ వద్ద ఉంటున్నాడు. మంగళవారం రాత్రి పాత మటన్ మార్కెట్ ప్రాంతంలో తన ఇద్దరి స్నేహితులతో కలిసి మద్యం తాగాడు. బుధవారం ఉదయం చూసే సరికి చనిపోయి రక్తపుమడుగులో పడి ఉండగా స్థానికులు అల్లూరు పోలీసులకు సమాచారమిచ్చారు. వారు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పంపారు. మద్యం మత్తులో పడి మృతిచెందాడా? లేదా ఎవరైనా హత్య చేశారా? అనేది పోస్టుమార్టం రిపోర్టులో తెలుస్తుందని ఎస్సై కిశోర్‌బాబు తెలిపారు. సురేష్‌ను హత్య చేసి ఉంటారని అనుమానం ఉందని అంబేడ్కర్ యువజన సంఘం రాష్ట్రాధ్యక్షుడు ఎల్లు సాల్మన్ రాజ్ తెలియజేశారు. పోలీసులు దర్యాప్తును వేగవంతం చేయాలని కోరారు.


గుంతల్ని తప్పించబోయి..

• కారు బోల్తా

కలువాయి(సైదాపురం): రోడ్డుపై ఉన్న గుంతల్ని తప్పించబోయి కారు బోల్తా పడిన ఘటన కలువాయి మండలంలోని కోటూరుపల్లి జాతీయ రహదారిపై బుధవారం జరిగింది. స్థానికుల కథనం మేరకు.. పెంచలకోనకు చెందిన శేషు కుటుంబ సభ్యులతో కనిగిరి నుంచి కలువాయి వైపు వస్తుండగా కారు అదుపుతప్పి బోల్తా పడి పక్కనే ఉన్న వాగులోకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో వాహనంలో ఉన్న ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు. రోడ్డుపై ఉన్న గుంతల్ని తప్పించబోయి కారు అదుపు తప్పిందని క్షతగాత్రులు తెలియజేశారు.

నిమ్మ ధరలు (కిలో)

పెద్దవి : రూ.32
సన్నవి : రూ.20
పండ్లు : రూ.10



పశు సంపద తగ్గింది

• గతంతో పోలిస్తే మూడు శాతం తగ్గిన సంఖ్య
• గణనలో వివరాల వెల్లడి
• ప్రభుత్వ ప్రోత్సాహకాలు అంతంతమాత్రమే..
• పశు బీమా అందక పాడి రైతుల గగ్గోలు

నెల్లూరు(పొగతోట): కూటమి ప్రభుత్వం పాడి రైతులను పట్టించుకోకపోవడంతో పశు సంపద తగ్గింది. గతంతో పోల్చుకుంటే జిల్లా వ్యాప్తంగా మూడు శాతం మేర పశువుల ఉత్పత్తి తగ్గినట్లు సమాచారం. బీమా, దాణా తదితరాల ఊసే లేకపోవడంతో ఈ సంఖ్య తగ్గినట్లు తెలుస్తోంది. గేదెలు, ఆవులు మూడు శాతం తగ్గినా పాల ఉత్పత్తి పెరిగిందంటూ పశుసంవర్ధక శాఖాధికారులు లెక్కలు చెప్పడం ఆశ్చర్యానికి గురి చేస్తోంది. 2018 గణాంకాల ప్రకారం జిల్లా వ్యాప్తంగా గేదెలు 6,27,930, మేకలు 10,20,764, గొర్రెలు 3,64,197 ఉన్నాయి. తాజా లెక్కల ప్రకారం గేదెల సంఖ్య మూడు శాతం తగ్గింది.

నేడిలా..

ఎండాకాలం కావడం, పశువుల సంఖ్య పూర్తిగా తగ్గడంతో పాల ఉత్పత్తి అనుకున్న స్థాయిలో లేదు. నిత్యం 500 లీటర్లు విక్రయించే పాలబూత్‌కు ప్రస్తుతం 300 లీటర్లు మాత్రమే వస్తున్నాయి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పశువులకు బీమా, మేత, పెంపకానికి సబ్సిడీలు అందించింది. ఏదైనా కారణంతో పశువులు మరణిస్తే బీమా నగదు సకాలంలో అందేది. పాడి రైతులు తిరిగి పశువులను కొనుగోలు చేసి ఆర్థికంగా అభివృద్ధి చెందారు. నేడు బీమా లేదు. నాడు డెయిరీల స్థాపనకు ప్రోత్సాహకాలు అందించారు. స్వయం సహాయక గ్రూపు మహిళలకు సైతం బ్యాంక్‌ల ద్వారా రుణాలు మంజూరు చేయించి డెయిరీలు ఏర్పాటు చేయించారు. వీటి ద్వారా పాడుపు మహిళలు ఆర్థిక ప్రగతి సాధించారు. కూటమి ప్రభుత్వంలో ఆ పరిస్థితి లేదు. కాగా ప్రతి 8 సంవత్సరాలకొకసారి పశుగణన చేపడతారు. ప్రస్తుతం ఈ ప్రక్రియ పూర్తయింది. వివరాలు కేంద్ర ప్రభుత్వానికి పంపించారు. వారి ఆదేశాల ప్రకారం త్వరలో పశు సంవర్ధక శాఖాధికారులు పూర్తి వివరాలు వెల్లడించనున్నారు.

> **మూడు శాతం పశువులు తగ్గాయి**
>
> జిల్లా వ్యాప్తంగా పశుగణన ప్రక్రియ పూర్తయింది. వివరాలను కేంద్ర ప్రభుత్వానికి పంపించాం. రెండు నుంచి మూడు శాతం పశువుల సంఖ్య తగ్గింది. పాడి రైతులను ఆదుకుని పశువుల సంఖ్య పెంచేలా చర్యలు చేపడుతున్నాం.
>
> – రమేష్ నాయక్, పశుసంవర్ధక శాఖ జేడీ